క్లుప్తంగా

కన్జర్వేషన్ జోన్ నుంచి విముక్తి

కందుకూరు: మహేశ్వరం, కందుకూరు మండలాలను కన్జర్వేషన్ జోన్ నుంచి విముక్తి చేయాలని కోరుతూ విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి బుధవారం సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. అభివృద్ధి చెందుతున్న ఈ రెండు మండలాలు కన్జర్వేషన్ జోన్ కింద ఉండడంతో రైతులు నష్టపోతున్నారని, అందువల్ల రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలని కోరారు. 111 జీఓను రద్దు చేసిన కేసీఆర్.. ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికను నెరవేరుస్తారనే నమ్మకం ఉందన్నారు. నగరానికి, విమానాశ్రయానికి అతి దగ్గరగా ఉన్న ఈ రెండు మండలాల్లో ప్రజల నివాసాలు గణనీయంగా పెరుగుతున్నాయని తెలిపారు. దీంతో రెసిడెన్షియల్ జోన్ ఆవశ్యకత ఏర్పడిందని మంత్రి పేర్కొన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మె బాట



ఎంపీడీఓకు వినతి పత్రం అందిస్తున్న పంచాయతీ కార్మికులు

కందుకూరు: గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె బాట పట్టనున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజు ఆధ్వర్యంలో బుధవారం ఎంపీడీఓ వెంకట్రాములు, ఎంపీఓ కల్యాణికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతన చట్టం అమలు చేయాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. బిల్లు కలెక్టర్లు, కారోబార్‌లకు పంచాయతీ నుంచి కాకుండా ప్రభుత్వమే వేతనం అందించాలన్నారు. కార్యక్రమంలో కారోబార్లు టి.మహేష్, కె.కృష్ణ, కార్మికులు కె.పోచమ్మ, కె.భారతమ్మ, శాంతమ్మ, మంగమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



నూతన కమిటీకి నియామక పత్రాన్ని అందజేస్తున్న అధ్యక్షుడు

కందుకూరు: మండల ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శివలింగంగౌడ్ ఆధ్వర్యంలో కమిటీని ప్రకటించారు. మండల కమిటీ అధ్యక్షుడిగా డి.పురుషోత్తం, ఉపాధ్యక్షుడిగా చందుగౌడ్, ప్రధాన కార్యదర్శిగా టి.హరిప్రసాద్, కోశాధికారిగా మట్ట పాండుగౌడ్‌లను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీకి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా పట్టించుకోరా?

మీర్‌పేట: నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా రోడ్డు పనులు ప్రారంభం కాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. మీర్‌పేట కార్పొరేషన్ పరిధిలోని ఎంఎల్ఆర్ కాలనీ నుంచి మీర్‌పేట చౌరస్తా వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. ఇటీవల కురిసిన చిన్నపాటి వర్షానికి రోడ్డంతా బురదమయంగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలు మంజూరు కాగా పనులు ప్రారంభం కాలేదు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

నేడు పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు

హయత్‌నగర్: ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా గురువారం పెంపుడు కుక్కలు, పిల్లులకు యాంటీ రాబిస్ టీకాలు ఉచితంగా ఇవ్వనున్నట్లు హయత్‌నగర్ పశువైద్యాధికారి డాక్టర్ ఆనంద్‌రెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని పెంపుడు జంతువుల పెంపకందారులు సద్వినియోగం చేసుకుని తమ పెంపుడు జంతువులకు టీకాలు ఇప్పించి రాబిస్ వ్యాధి వ్యాప్తి చెందకుండా సహకరించాలని ఆయన కోరారు.

కన్యకాపరమేశ్వరీ ఆలయంలో లలితాసహస్రనామ యజ్ఞం

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవాలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం, ఆర్యవైశ్య మహిళాసంఘం ఆధ్వర్యంలో శ్రీ లలితా సహస్రనామ యజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ, కోశాధికారి డా.శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 6 గంటలకు అమ్మవారికి అభిషేకం, 8 గంటలకు గోమాత పూజా కార్యక్రమం, 9 గంటలకు ప్రత్యేక పూజలు, 11 గంటలకు లలితా సహస్రనామయజ్ఞం, 12 గంటలకు సామూహిక కుంకుమార్చన.. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

వ్యాయామం.. ఆరోగ్యం పదిలం



శివనారాయణపురం కాలనీలో ఓపెన్ జిమ్

బడంగ్‌పేట్: బిజీ లైఫ్‌లో ఆరోగ్యంగా ఉండాలనే విషయాన్ని మరిచిపోతున్నారు. తద్వారా అనారోగ్యానికి గురవుతూ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో సతమతమవుతున్నాడు. ఇలాంటి దీర్ఘకాలిక వ్యాధులకు చెక్ పెట్టాలంటే వ్యాయామం తప్పనిసరి. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలో ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు సిద్ధం

బడంగ్‌పేట 23వ డివిజన్‌లోని శివనారాయణపురం కమ్యూనిటీ హాలు ఆవరణలో రూ.12 లక్షలతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. స్థానికులు, యువకులు, చిన్నారులు, విద్యార్థులు, మహిళలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఉదయం, సాయంత్రం సమయంలో వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని మెరుగుపర్చుకుంటున్నారు. ఇప్పటికే అల్మాస్‌గూడలోని వైఎస్ఆర్ పార్కులో, బడంగ్‌పేటలోని 20వ డివిజన్‌లోని అన్నపూర్ణనగర్ కాలనీలో, 29వ డివిజన్‌లోని సీతామెడోస్ కాలనీలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ స్థలాలు, పార్కుల్లో, బహిరంగ ప్రదేశాలు ఏ డివిజన్‌లో ఉన్నా ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యాశాఖమంత్రి సబితారెడ్డి పేర్కొన్నారు.

చాలా సంతోషంగా ఉంది



మా కాలనీలో కమ్యూనిటీ హాలు కోసం వెంచర్ చేసిన నిర్వాహకులు కొంత స్థలాన్ని కేటాయించారు. ఆ స్థలాన్ని కబ్జా చేస్తారని ఆందోళన చెందాం. కానీ రూ.18 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మించారు. ఇప్పుడు ఓపెన్ జిమ్‌ను కూడా ఏర్పాటు చేశారు. పిల్లలు, పెద్దలు, ముఖ్యంగా కాలనీలోని మహిళలు ధైర్యంగా జిమ్‌కు వెళ్లి వ్యాయామం చేస్తున్నారు. అభివృద్ధికి సహకరిస్తున్న మంత్రి సబితారెడ్డికి కృతజ్ఞతలు.

– కె.ప్రభాకర్, శివనారాయణపురం కాలనీ అధ్యక్షుడు

జల్‌పల్లిలో జడివాన



సీసీ రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

పహాడీషరీఫ్: జల్‌పల్లిలో మంగళవారం రాత్రి జడివాన కురిసింది. అర్ధరాత్రి 12 గంటలకు ప్రారంభమైన వర్షం ఎడతెరిపి లేకుండా బుధవారం తెల్లవారుజామున 3 గంటల వరకు దంచి కొట్టింది. భారీ వర్షానికి శ్రీరాం కాలనీ ప్రజలు ఇబ్బంది పడ్డారు. 19వ వార్డులో వర్షం నీరు బయటకు వెళ్లకుండా గోడలు నిర్మించారు. దీంతో వరద ఇళ్లలోకి వెళ్లడంతో స్థానికులు ఆందోళన చెందారు.

సీసీ రోడ్డును ముంచెత్తిన మురుగు

ప్రజ్ఞా స్కూల్ పక్క వీధిలో అప్పటి జనాభాకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్లు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో జనావాసాలు పెరిగాయి. అందుకు అనుగుణంగా డ్రైనేజీ పైప్‌లైన్లు ఏర్పాటు చేయలేదు. దీంతో భారీ వర్షానికి డ్రైనేజీ పొంగుతోంది. శ్రీరాం కాలనీ, మధుబన్ కాలనీ రోడ్డుపై మురుగునీరు పారింది. మురుగునీటి దుర్వాసనతో స్థానికులు ఇబ్బందిపడ్డారు.

సమస్యకు త్వరలోనే పరిష్కారం

శ్రీరాం కాలనీలో అవుట్‌లెట్ సమస్య మూడు దశాబ్దాలుగా ఉంది. మంత్రి సబితా ఇంద్రారెడ్డి చొరవతో ఎగువ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా లైన్లు వేశారు. త్వరలోనే అవుట్‌లెట్ సమస్యకు శాశ్వతం పరిష్కారం లభిస్తుంది.

– పల్లపు శంకర్, 19వ వార్డు కౌన్సిలర్

లెనిన్‌నగర్ అభివృద్ధికి ప్రణాళిక



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబిత తదితరులు

మంత్రి సబితారెడ్డి

మీర్‌పేట: లెనిన్‌నగర్‌లో యాక్షన్ ప్లాన్‌తో సమస్యలను పరిష్కరిస్తామని విద్యాశాఖామంత్రి సబితా ఇంద్రారెడ్డి ప్రకటించారు. మీర్‌పేట కార్పొరేషన్ 35వ డివిజన్‌లో రూ.50 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే 34వ డివిజన్‌లో రూ.10 లక్షలతో నిర్మించిన సాంస్కృతిక భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో లెనిన్‌నగర్ ప్రజలు ముంపు సమస్యతో ఇబ్బందులు పడేవారని, వరదనీరు సాఫీగా వెళ్లేందుకు ప్రత్యేకంగా టన్నెల్ నిర్మించి సమస్యను పరిష్కరించామన్నారు. అభివృద్ధి కళ్ల ముందు కనపడుతున్నా కొందరు అభివృద్ధి జరగడం లేదని ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. స్థానిక విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని పాఠశాలల అభివృద్ధి, నూతన జూనియర్, డిగ్రీ కళాశాలలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. మహేశ్వరం నియోజకవర్గానికి మెడికల్ కళాశాలను మంజూరు చేయడంపై మంత్రి హర్షం వ్యక్తం చేస్తూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ ఎం.దుర్గాదీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, స్థానిక కార్పొరేటర్ జిల్లా సౌందర్య, ఫ్లోర్‌లీడర్ అర్కల భూపాల్‌రెడ్డి, కమిషనర్ సిహెచ్. నాగేశ్వర్, డీఈ గోపినాథ్, కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

డిగ్రీలో సీట్ల భర్తీకి ఆహ్వానం

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ బీసీ గురుకుల బాలుర డిగ్రీ కళాశాల వివిధ కోర్సుల్లో సీట్ల భర్తీకి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ జంగం విరుపాక్షప్ప బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ గ్రూప్‌లో ఎంఎస్‌సీఎస్, ఎంఎస్‌డీఎస్, ఎంఎస్ఏఐ, బీజెడ్సీ, బీకామ్ కంప్యూటర్, బీబీఏ, బీఏలో ఈపీఐఆర్, యంఈఎస్‌లో సీట్లున్నాయని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కల్గిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో ఈనెల 7వ తేదీ లోపు నేరుగా కళాశాలకు వచ్చి అడ్మిషన్ పొందాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం సెల్ నెంబర్లు 9989269715, 9010672876ను సంప్రదించాలన్నారు.

నేడు అమీర్‌పేట్, ఘట్టుపల్లికి మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: గురువారం మండలంలోని అమీర్‌పేట్, ఘట్టుపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. రూ.15.20 కోట్ల నిధులతో మన్సాన్‌పల్లి–కోళ్లడకల్ వయా ఘట్టుపల్లి బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. అలాగే అమీర్‌పేట్, ఘట్టుపల్లి గ్రామాల్లో సీసీ, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించనున్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల్లో మంత్రితో పాటు జెడ్పీ చైర్మన్ తీగల అనితారెడ్డి పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు విజయవంతం చేయాలని ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి కోరారు.

మిషన్ వాత్సల్య పథకానికి అర్హతలివే..

కందుకూరు: మిషన్ వాత్సల్య పథకం ద్వారా తల్లి, తండ్రి, లేదా ఇద్దరు మరణించినా.. లేదా విడాకులు తీసుకున్న 18 ఏళ్ల లోపు పిల్లలకు నెలకు రూ.4 వేలు ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తుందని ఐసీడీఎస్ షబానా తెలిపారు. ఎంపికైన పిల్లలకు మూడేళ్ల పాటు ప్రతి నెలా రూ.4 వేలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని పేర్కొన్నారు. వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.72 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.96 వేల ఉన్న వారి కుటుంబాలకు చెందిన పిల్లలు అర్హులన్నారు. దరఖాస్తులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ అజయ్

మహేశ్వరం: వర్షకాలంలో అంటువ్యాధులు వ్యాపించకుండా ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు చర్యలు చేపట్టాలని దుబ్బచర్ల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ అజయ్‌కుమార్ సూచించారు. బుధవారం దుబ్బచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశావర్కర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో గ్రామాల్లో అంటువ్యాధులు వ్యాపించకుండా ఆశావర్కర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. డెంగ్యూ, మలేరియా, టీబీ ఇతర వ్యాధుల లక్షణాలు కనిపిస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనలతో మందులు వాడాలని కోరారు. ఈ సమావేశంలో దుబ్బచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆసుపత్రి డీఈఓ నర్సింహరావు, హెల్త్ సూపర్‌వైజర్లు జలీల్, సువర్ణ, ఎంపీహెచ్ రవికుమార్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

5 పంచాయతీలకు రూ.కోటి



మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మహేశ్వరం, కందుకూరు మండలాల్లోని ఐదు గ్రామ పంచాయతీల నూతన భవనాలకు ప్రభుత్వం కోటి రూపాయలు విడుదల చేసింది. బుధవారం నిధులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ రెండు మండలాల్లోని డబిల్‌గూడ, పెద్దమ్మ తండా, హబిబుల్లాగూడ(పులిమక్త), మెహబ్బత్‌నగర్, సార్లరావులపల్లి గ్రామ పంచాయతీల నూతన భవనాల నిర్మాణాలకు ఎన్ఆర్‌జీఈఎస్ కింద రూ.కోటి నిధులు మంజూరయ్యాయని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఒక్కో గ్రామ పంచాయతీకి రూ.20 లక్షల చొప్పున మొత్తం రూ.కోటి నిధులు కేటాయించారు. త్వరలో టెండర్లు పిలిచి భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తామని మంత్రి పేర్కొన్నారు. నిధులు మంజూరు చేయించిన సబితారెడ్డికి ఆయా గ్రామ సర్పంచ్‌లు ధన్యవాదాలు తెలిపారు.

బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ తప్పదు

అందెల శ్రీరాములు యాదవ్



అందెల సమక్షంలో బీజేపీలో చేరిన బాలాపూర్ వాసులు

బడంగ్‌పేట్: బీఆర్ఎస్‌కు వీఆర్ఎస్ తప్పదని మహేశ్వరం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జీ అందెల శ్రీరాములుయాదవ్ హెచ్చరించారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాషాయజెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అందెల సమక్షంలో పలువురు బీజేపీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి ఉన్నా అభివృద్ధి సూన్యమన్నారు. బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రావుల మల్లేష్, గడ్డం వెంకటేష్, గుండె నాగార్జున, ప్రభాకర్, ప్రకాష్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, దొడ్డి శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

ప్రసన్న చదువుకు అండగా ఉంటాం



ప్రసన్నకు చెక్కు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

ఉప్పల ట్రస్టు ఛైర్మన్ వెంకటేశ్

తలకొండపల్లి: తండ్రి కోల్పోయిన ఆడపిల్లల చదువుకు ఉప్పల ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ చేయూత నందిస్తున్నాడు. మండల పరిధిలోని లింగరావుపల్లికి చెందిన శ్రీనివాస్‌రెడ్డి కూతురు ప్రసన్న ప్రస్తుతం హైదరాబాద్‌లో బీటెక్ చదువుతుంది. అయితే శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల మృతిచెందాడు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో సతమతవుతుండగా స్థానిక నాయకుడు, ఎంపీటీసీ రమేష్ సహకారంతో ప్రసన్న జెడ్పీటీసీని వెంకటేశ్‌ను కలిసి తన చదువుకు సహాయం చేయాలని కోరింది. స్పందించిన వెంకటేశ్ ట్రస్టు ద్వారా ప్రసన్నను చదివిస్తానని.. ఆమె ఉన్నత చదు వుకయ్యే ఖర్చులను తానే భరిస్తానని భరోసా పలికారు. ట్రస్టు సభ్యులచే తక్షణ సహాయంగా బుధవారం రూ.15 వేలు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ జోగు రమేష్, ఉప సర్పంచ్ పాండు, గోవిందారెడ్డి, సాయి, భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత..

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలోని శాంతినగర్ కాలనీకి చెందిన పాతకోట రాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులను బుధవారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు సభ్యులు నాగిళ్ల జగన్ పరామర్శించారు. ట్రస్టు చైర్మన్, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సమకూర్చిన రూ.3వేలను నాగిళ్ల జగన్‌కు అందజేశారు. స్థానిక నాయకులు అంజద్, మహేశ్, సైదులు, మజీద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కోర్టులో ఉచిత వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి పట్టాభి రామారావు

రంగారెడ్డి కోర్టులు: న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో గురువారం అవేర్ గ్లెనీగల్స్ గ్లోబల్ హాస్పిటల్స్ వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి డాక్టర్ పట్టాభి రామారావు ఈ శిబిరాన్ని ప్రారంభించి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య సిబ్బంది పలువురు న్యాయమూర్తులు, న్యాయవాదులతో పాటు మొత్తం 297 మందికి మధుమేహం, బీపీ, ఈసీజీ, 2డి ఎకో వంటి పరీక్షలు చేసి పలు ఆరోగ్య జాగ్రత్తలు సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు డీకొండ రవీందర్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవ రెడ్డి, న్యాయవాదుల పరస్పర సహకార సంఘం సంచాలకుడు డాక్టర్ బాచిరెడ్డి శాయిరెడ్డి, బార్ కౌన్సిల్ సభ్యులు అనంతసేన్ రెడ్డి, రామారావు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం: సామ



హస్తినాపురంలో పర్యటిస్తున్న సామ రంగారెడ్డి

హస్తినాపురం: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమయ్యిందని రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి విమర్శించారు. బుధవారం హస్తినాపురం సెంట్రల్‌కాలనీలోని మేజర్ పద్మపాణి ఆచార్య కమ్యూనిటీ హాల్ నుంచి షిరిడీ సాయినగర్‌కాలనీ, లక్ష్మీనర్సింహపురి కాలనీ, కేశవపురి కాలనీల్లో ఆయన ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరిస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతి బీజేపీ కార్యకర్తపై ఉందన్నారు. డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వరదనీటి కాలువల్లోకి డ్రైనేజీ నీరు వచ్చి దుర్గంధం వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. ఈ పరిస్థితికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కారణమని, ఆయనకు అభివృద్ధిపై ఏమాత్రం చిత్తశుద్ధి లేదని రంగారెడ్డి విమర్శించారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పి.నరేశ్‌యాదవ్, మాధవరెడ్డి, అమరేందర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, రాజేందర్, శ్రీనివాస్, సాయి పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

హస్తినాపురం: చిన్నారులకు పౌష్టికాహారంపై అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం తమ పాఠశాలలో శాకంబరి అమ్మవారి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని నాగార్జున విద్యాసంస్థల వైస్ చైర్‌పర్సన్ గుమ్మకొండ రజనీ విఠల్‌రెడ్డి తెలిపారు. హస్తినాపురంలోని నాగార్జున మోడల్ స్కూల్‌లో బుధవారం శాకంబరి అమ్మవారి ఉత్సవాలను నిర్వహించారు. వివిధ రకాల పండ్లు, కూరగాయలతో అలంకరించిన అమ్మవారి రూపం విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కె.విజయ్‌కుమార్‌రావు, ఇన్‌చార్జ్‌లు సవిత, దివ్య, పుష్పలత, అరుణ, ప్రియాంక, ఉషశ్రీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దుర్వాసన.. దోమల బెడద

- వరదనీటి కాలువలోకి చేరుతున్న డ్రైనేజీ నీరు
- మురుగు కంపు, దోమల విజృంభణ
- హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీ వాసుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు



వరదనీటి కాలువలోకి మురుగునీరు చేరకుండా మరమ్మతులు చేపట్టి వదిలేసిన దృశ్యం



హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీలో వరదనీటి కాలువలో కలుస్తున్న మురుగునీరు

హస్తినాపురం: హస్తినాపురం డివిజన్‌లోని వివిధ ప్రాంతాలలో నిర్మించిన వరదనీటి కాలువల్లో మురుగు నీరు పారుతూ దుర్గంధం వెదజల్లుతుండటంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీలోని పరిస్థితే ఇందుకు నిదర్శనం. తమ కాలనీలో నిర్మించిన వరదనీటి కాలువలోకి పైకాలనీల నుంచి డ్రైనేజీ నీరు వచ్చి చేరుతోందని, ఎగసి వస్తున్న దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. సమస్యను పరిష్కరించాలని జలమండలి అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు.

- హస్తినాపురం నార్త్ ఎక్స్ టెన్షన్ కాలనీలో కోట్లాది రూపాయలు వెచ్చించి వరదనీటి కాలువలు నిర్మించారని, ఈ కాలువలోకి టీఎస్ఆర్ అపార్ట్‌మెంట్ల నుంచి డ్రైనేజీ నీరు వచ్చి చేరడంతో దుర్వాసన వస్తోందని కాలనీవాసులు చెప్తున్నారు.
- మురుగునీటి కారణంగా దోమలు అధికమై కాలనీపై దండయాత్ర చేస్తున్నాయని, రాత్రిపూట కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయని వాపోతున్నారు.
- మురుగు కంపు, దోమల కారణంగా వ్యాధుల బారినపడే అవకాశంఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- తమ కాలనీలోని వరదనీటి కాలువలోకి మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదు చేస్తే ఏడాది క్రితం వరద కాలువలో మురుగు కలుస్తున్న ప్రాంతంలో మరమ్మతుల పేరుతో జలమండలి, సాహెబ్‌నగర్ సెక్షన్ అధికారులు హడావుడి చేసి చేతులు దులుపుకున్నారని, పనులు జరుగుతున్నట్లు వారు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులు ఇప్పటికీ అక్కడే ఉన్నాయని స్థానికులు చెప్తున్నారు.
- ఇప్పటికైనా జలమండలి ఉన్నతాధికారులు వదరనీటి కాలువలోకి మురుగు చేరకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇళ్లలో ఉండలేకపోతున్నాం..



కాలనీలోని వరదనీటి కాలువలోకి మురుగు కలవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో తాము ఇళ్లలో ఉండలేకపోతున్నాం. కేవలం వర్షం నీళ్లు వెళ్లడానికి ఏర్పాటు చేసిన కాలువలోకి డ్రైనేజీ నీరు కలుస్తుండటంతో తాము ఇబ్బందులు పడుతున్నాం. మురుగు నీటి వల్ల దోమలు పెరిగి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– చంద్రశేఖర్‌యాదవ్, హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్‌కాలనీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు